క్లుప్తంగా

సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవ నగర్ సాయిబాబా ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ సమక్షంలో హుండీలను లెక్కించారు. రూ.3,51,357 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీరాం రవీందర్‌గుప్తా తెలిపారు. మణిక్యశర్మ, రామకృష్ణ శర్మ, హరికృష్ణ శర్మ, సిబ్బంది హరితారాణి, సంతోష్ కుమార్, సోమయ్య పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



నిజామాబాద్‌నాగారం: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ రాజశేఖర్ 79వ సారి రక్తదానం చేయగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నెలకు సుమారు 350 యూనిట్ల రక్తాన్ని తలసేమియా పిల్లలకు అందజేస్తున్నట్లు తెలిపారు. అరుణ్ బాబు, అబ్బాపూర్ రవీందర్, మురళి కృష్ణ, సుమిత, డి శ్రీనివాస్, ప్రణయ్, సంయోద్దీన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం రైతు ఉత్పత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నవీపేట్ మండల ఉత్పత్తి దారుల సంఘం చైర్మన్ పృథ్వీరాజ్, ఇందూరు–డిచ్‌పల్లి చైర్మన్ నాగయ్య, రైతు నాయకులు టక్కర్ హన్మంత్ రెడ్డి, ఆకుల పాపయ్య, భూమయ్య, కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు రమణారావు, మధుకర్ రావు, నీలం రెడ్డి, జీవన్‌రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నిజామాబాద్‌అర్బన్: సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని వెంగళ్‌రావునగర్ ఉర్దూ మీడియం పాఠశాలలో శుక్రవారం కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. మేయర్ దండు నీతూకిరణ్ సహకారంతో విద్యార్థులకు పరీక్షలు చేసి అద్దాలను, మందులు పంపిణీ చేశారు. సూర్య ఆరోగ్య సంస్థ సీఈవో సూర్యతేజ, సూర్య భగవాన్, రాజేంద్రకుమార్ విక్రమ్, వినోద్, ప్రశాంత్, శ్రీకాంత్, డాక్టర్ నితీష్ కుమార్, తిరుమల డెంటల్ కళాశాల సిబ్బంది, స్కూల్ హెచ్‌ఎం భూమయ్య, స్కూల్ చైర్మన్ ముక్తార్ పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థలు అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐపీఎస్‌యూ, ఎస్‌ఎఫ్ఐ, టీజీవీపీ, ఎల్ఎఫ్‌వో నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్న విద్యాసంస్థలు



నిజామాబాద్ అర్బన్: ర్యాంకుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెంచి విద్యార్థులను బలి తీసుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మేడ్చల్ జిల్లాలోని శ్రీ చైతన్య కళాశాలలో యాజమాన్యం ఒత్తిడితో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులను బలిగొంటున్న కాలేజీలను సీజ్ చేయాలన్నారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీ చైతన్య విద్యా సంస్థలు ప్రభుత్వ జీవోలను విస్మరించి సెలవులు రోజున విద్యా సంస్థలను నడపడం దారుణమన్నారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విగ్నేష్, నగర అధ్యక్షుడు విశాల్, సందీప్ పాల్గొన్నారు.

చెత్తతో నిండుతున్న 'పూలాంగ్'

- వాగులో చెత్త పడేస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



పూలాంగ్ వాగులో చెత్త

నిజామాబాద్ సిటీ: నగరంలోని పూలాంగ్ వాగు చెత్తాచెదారంతో నిండిపోతోంది. రాత్రివేళలో పలువురు వ్యాపారాలు తమ దుకాణాల్లోని చెత్తను తీసుకువచ్చి రాత్రివేళలో గుట్టుచప్పుడు కాకుండా వాగులో పారవేస్తున్నారు. ఇలా నిత్యం జరుగుతుండటంతో పూలాంగ్‌వాగు చెత్తతో నిండిపోతోంది. పగిలిన ప్లాస్టిక్ వస్తువులు, గాజు ముక్కలు, చికెన్, మాంసం వ్యర్థాలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలను వాగు పక్కన, వాగు కొద్ది దూరంలో వ్యాపారం చేసే పలువురు వాగు పైనుంచి ప్రవహించే మురుగునీటిలో పారవేస్తున్నారు. ఫలితంగా చెత్త కుళ్లిపోయి వాగుతీరాన దుర్వాసన వస్తోందని పలువురు వాపోతున్నారు.

రాత్రి వేళలో..

నగరంలోని పూలాంగ్ వాగుపై ఎనిమిది చోట్ల బ్రిడ్జిలు ఉన్నాయి. వినాయక్‌నగర్, పూలాంగ్‌చౌరస్తా, దేవిటాకీస్, ప్రగతినగర్, ఎల్లమ్మగుట్ట, బైపాస్‌రోడ్డు(డిచ్‌పల్లి వైపు) గంగాస్థాన్ ఫేస్2, ముబారక్‌నగర్(ఆర్మూర్‌రోడ్డు). అయితే ఆయా ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యాపారులు దినమంత వ్యాపారాలు చేసి రాత్రివేళ దుకాణం మూసివేశాక అక్కడి చెత్తను తమ ముంగిటకు వచ్చే మున్సిపల్ పారిశుధ్య వాహనంలో వేయాలి. ఇలా వేస్తే వారికి డబ్బులు చెల్లించాల్సి వస్తుందని, దీనిని తప్పించుకునేందుకు వారు రాత్రివేళలో బ్రిడ్జిపై నుంచి ఎవరూ చూడని సమయంలో వాగులో పారవేసి వెళ్తున్నారు. దాంతో పూలాంగ్‌వాగు చెత్తమయంగా మారుతోంది. సంబంధిత అధికారులు చెత్త పారవేయకుండా చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

స్వచ్ఛమైన నీళ్లు ప్రవహించేవి



గతంలో పూలాంగ్ వాగులో స్వచ్ఛమైన నీరు ప్రవహించేది. వాగు పరీహాహక ప్రాంతాలలో భవనాలు, ఇళ్లు వెలియడంతో ఆ మురుగు నీరు వాగులో ప్రవహించటం మొదలయ్యింది. అనంతరం ప్రజలు చెత్తను వేయటం మొదలుపెట్టారు. చెత్త వేయటంతో మురుగు నీరు ప్రవాహానికి అంతరాయం కలుగుతుంది. దాంతో అక్కడ దుర్వాసన వస్తోంది.

– ఎల్లగౌడ్, వినాయక్‌నగర్

చర్యలు తీసుకోవాలి



పూలాంగ్ వాగులో చెత్తను పారవేసే వారిపై మున్సిపల్ అధికారులు నిఘా పెట్టాలి. చెత్తతో పూలాంగ్ వాగు నిండి అటువైపు వెళ్తుంటే తీవ్రమైన దుర్వాసన వస్తోంది. కొంతమంది చికెన్ సెంటర్ల నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను పారవేస్తున్నారు. వాగులో చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలి.

– జి దేవేందర్, హౌసింగ్‌బోర్డు కాలనీ

కొనసాగుతున్న ప్రజాపాలన



తిర్మన్‌పల్లిలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రకుమార్



నగరంలోని 11వ డివిజన్‌లో మేయర్ నీతూకిరణ్

సాక్షి, నెట్‌వర్క్ : ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంలో కొనసాగుతోంది. శుక్రవారం ఆయా గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఇందల్వాయిలో దరఖాస్తుల స్వీకరణను ఆర్డీవో రాజేంద్రకుమార్ పరిశీలించారు. నగరంలోని 11వ డివిజన్‌లోని కేంద్రాన్ని శుక్రవారం మేయర్ దండు నీతూకిరణ్ పరిశీలించారు. మోపాల్ మండలంలో స్పెషల్ ఆఫీసర్ సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ లింగం, తహసీల్దార్ ఖాజా ఖుద్బుద్దీన్, డీటీ మునీరుద్దీన్, పీఆర్ ఏఈ స్రవంతి, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, ఏపీఎం మోహన్ దరఖాస్తులు స్వీకరించారు. సిరికొండ మండలంలో ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, తహసీల్దార్ రవీందర్‌రావు పాల్గొన్నారు. ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ రూరల్ మండలం ఎంపీడీవో మల్లేశ్ సూచించారు.



గోప్యతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ధర్పల్లి మండలంలో స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో లక్ష్మణ్, ఏవో ప్రవీణ్ పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలో గ్రామసభలను ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, తహసీల్దార్ రాజేందర్, ఏవో రాంబాబు పర్యవేక్షించారు. ట్రాన్స్‌కో రూరల్ డీఈ ఉత్తమ్‌కుమార్ జాడే నడిపల్లి గ్రామ సభను సందర్శించి ప్రజలకు గృహజ్యోతిపై అవగాహన కల్పించారు.



నడిపల్లి ప్రజాపాలన సభలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు



గోవింద్‌పల్లిలో..



కులాస్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో లింగం

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి), సాంపల్లి, బర్దిపూర్, సుద్దులం గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు నర్సింగరావు, బిక్యానాయక్, కృష్ణవేణి, గోదావరి శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారి మెడలో కండువాలు వేసి ఎమ్మెల్యే వారిని పార్టీలోకి ఆహ్వానించారు. మొదట కాంగ్రెస్ తరఫున ఎంపీటీసీగా గెలిచిన నర్సింగ్‌రావు అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తిరిగి సొంత పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ఎంపీటీసీలుగా ఉన్న బిక్యానాయక్, కృష్ణవేణి, గోదావరి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కంచెట్టి గంగాధర్, పాలసాని శ్రీనివాస్, ఎంపీటీసీ సీహెచ్‌నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డీబీ తండా సర్పంచ్..

ధర్పల్లి: మండలంలోని ధనం బాండ తండా సర్పంచ్ నరేందర్ శుక్రవారం ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాయకులు మనోహర్‌రెడ్డి, కృష్ణ, గంగారెడ్డి పాల్గొన్నారు.

రామమందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం



నిజామాబాద్ సిటీ: అయోధ్యలో జనవరి 22న రామమందిర ప్రారంభోత్సవానికి ఆహ్వాన పత్రికలను జిల్లాలోని పలువురు స్వామీజీలకు వీహెచ్‌పీ ఇందూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. నందిపేట్ పలుగుట్ట మంగి రాములు మహరాజుకు, మల్లారం లింగేశ్వర గుట్ట పిట్ల కృష్ణ మహరాజుకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాగూర్, కార్యదర్శి గాజుల దయానంద్, విభాగ్ కార్యదర్శి కృష్ణ, విభాగ్ ధర్మాచార్య సంపర్క్ కత్రాజ్ నరేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి:కాంగ్రెస్ పాలనలో కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కేఎన్ఆర్ గార్డెన్స్‌లో ప్రభుత్వం తరఫున నిర్వహించిన నియోజకవర్గ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం కులాల పేరుతో పాఠశాలలను ఏర్పాటు చేసి సమాజాన్ని విడదీసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్డీవో రాజేంద్రకుమార్‌ను ఆదేశించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రైస్తవులకు దుస్తులు, కానులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కె నగేష్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, జిల్లా కిసాన్‌కేత్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, పాలసాని శ్రీనివాస్, శ్యాంసన్, వాసు, ధర్మాగౌడ్, ఎంపీటీసీ నర్సయ్య, నవీన్, గంగారెడ్డి, ఏడు మండలాలకు చెందిన పాస్టర్లు భిక్షపతి (జాన్‌పాల్), ప్రభాకర్, రవికుమార్, డేవిడ్ నాయక్, యేసుదాసు, రాజ్‌కుమార్, డేవిడ్, మోజెస్ పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు



మోపాల్: అయోధ్య రాముడి అక్షింతలు గ్రామానికి చేరడంతో శుక్రవారం మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి హనుమాన్ ఆలయం వరకూ భారీ ర్యాలీగా ఊరేగించారు. అనంతరం ఆలయ గర్భగుడిలో భద్రపర్చారు. అక్షింతలను జనవరి 1 నుంచి 15వ తేదీవరకూ ప్రతి ఇంటికి చేరేలా ప్రణాళికలు రూపొందించుకున్నామని, ఈమేరకు ఐదుగురితో అయోధ్య రామాలయ ట్రస్ట్ పేరుతో కమిటీ ఏర్పాటు చేసుకున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు ద్యాప రవి తెలిపారు. సర్పంచ్ క్యాతం రవి, వీడీసీ అధ్యక్షుడు గాదె జనార్దన్, ఎల్ఐసీ గంగారెడ్డి, నవీన్‌రెడ్డి, హరీష్, సతీష్, హరీష్ గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

2న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నిజామాబాద్ అర్బన్: బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతామని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారికి నోటీసు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు అందరూ కూడా మంగళవా రం స్కూళ్లలో వంట బంద్ చేసి కలెక్టర్ ఆఫీస్ దగ్గరికి ధర్నాకు రావాలని కోరారు. సంఘం అ ధ్యక్షురాలు బైరి సాయమ్మ, తదితరులున్నారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	40	60
బెండకాయ	60	90	పచ్చిమిర్చి	50	75
జీరకాయ	60	90	దోసకాయ	20	40
దొండకాయ	40	60	ఆలుగడ్డ	16	30
జిర్నిసుకాయ	40	70	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	60
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	60	80
మెంతికూర	70	100	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

బంగారం ధరలు (10గ్రాములు)


24 క్యారెట్స్	63,450	వెండి (కిలో)	77,300
22 క్యారెట్స్	58,506		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా పిషియన్)

- స్క్రీన్-2 సలార్ 10.20, 7.20, 10.30; హాయ్ నాన్న(తెలుగు)-1.30; డెవిల్(తెలుగు)-4.25
- స్క్రీన్-3 డెవిల్(తెలుగు)-10.15,7.30,10.30; సలార్(తెలుగు)- 1.10,4.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 సలార్(తెలుగు)- 11.25, 6.10, 9.45; బాబుల్‌గమ్(తెలుగు)-3.00
- స్క్రీన్-2 డెవిల్(తెలుగు)-11.15,6.00; సలార్(తెలుగు)-2.25 9.10
- స్క్రీన్-3 బద్మాష్ గాలీకీ(తెలుగు)-12.25; ఉమాపతి(తెలుగు)-3.15; హాయ్ నాన్న(తెలుగు)-6.45; యానిమల్(తెలుగు)-10.00
- స్క్రీన్-4 డుంకీ(హిందీ)-12.20 6.55; హాయ్‌నాన్న(తెలుగు)-3.40; బాబుల్‌గమ్(తెలుగు)-10.15

- దేవి డెవిల్(తెలుగు)
- నటరాజ్ బాబుల్‌గమ్(తెలుగు)
- లలితామహల్ సలార్(తెలుగు)
- విజయ్ సలార్(తెలుగు)

హరితహారానికి సిద్ధమవుతున్న నర్సరీలు



రామడుగు నర్సరీలో బ్యాగుల్లో మట్టిని నింపుతున్న ఉపాధి కూలీలు

ధర్పల్లి: వానాకాలంలో చేపట్టే హరితహారం కార్యక్రమానికి నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. అవసరమైన మొక్కలను పెంచడానికి గ్రామీణ అభివృద్ధి శాఖ కసరత్తు మొదలు పెట్టింది. ధర్పల్లి మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలోని నర్సరీలో పది వేల మొక్కల చొప్పున 2.20 లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా నర్సరీల్లో ప్లాస్టిక్ బ్యాగుల్లో మట్టి నింపి, వివిధ రకాల విత్తనాలు వేశారు.

పంచాయతీలదే బాధ్యత

ఆయా గ్రామాల్లోని నర్సరీల బాధ్యత పంచాయతీలదే. నర్సరీల సంరక్షణకు వన సంరక్షకులను ఇప్పటికే నియమించారు. నాణ్యత కూడిన మట్టి సేకరణ, నీటి సదుపాయం, సంచుల్లో గింజలు నాటడం, కలుపు తీయడం అవసరమైతే పెద్ద బ్యాగులకు మొక్కలను మార్చడం లాంటి పనులు గ్రామపంచాయతీ ఉపాధి హామీ కూలీలతో గాని అవసరమైతే పంచాయతీ సిబ్బందితో చేయించాల్సి ఉంటుంది. ఆయా గ్రామ పంచాయతీలకు కేటాయించిన లక్ష్యాల మేరకు మొక్కలు పెంచాలి.

పూలు, పండ్ల మొక్కలకు ప్రాధాన్యం

గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలకు ప్రాధానం ఇచ్చారు. ఎక్కువగా గులాబీ, మల్లె, గన్నేరు, జామ, ఉసిరి, నిమ్మ, మామిడి, దానిమ్మ, బొప్పాయి, బాదం, అల్ల నేరేడు, ఆకాశమల్లి వంటి మొక్కలను పెంచేందుకు విత్తనాలు నాటారు.

విత్తనాలు నాటే ప్రక్రియ వేగవంతం



హరితహారం కోసం మొక్కలను పెంచడానికి నర్సరీలో విత్తనాలు నాటే ప్రక్రియను వేగవంతంగా చేపట్టాం. ఉపాధి హామీ కూలీలు బ్యాగుల్లో మట్టి నింపి విత్తనాలను నాటుతున్నారు. ఇప్పటికే కొన్ని నర్సరీలో విత్తనాలు నాటే ప్రక్రియ పూర్తయింది. నర్సరీలో మొక్కలు సక్రమంగా పెరిగే విధంగా ఏర్పాట్లు చేపట్టాం.

– లక్ష్మణ్ ,ఎంపీడీవో, ధర్పల్లి

బడి బయటి దివ్యాంగులను గుర్తించాలి

ఆర్మూర్: బడి బయట ఉన్న దివ్యాంగులను గుర్తించి వారిని సమీపంలోని పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష సహిత విద్యా (ఐఈ) జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు సూచించారు. ఆర్మూర్‌లోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో దివ్యాంగులకు అందిస్తున్న సేవలను ఐఈఆర్పీ కిషన్‌ను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రతీ శుక్రవారం నిర్వహించే ఫిజియోథెరపి వైద్య శిబిరాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే నెల 11 వరకు దివ్యాంగుల గుర్తింపు కోసం సర్వేనునిర్వహించాలని సూచించారు.

సామూహిక సెలవులకు అనుమతించాలని వినతి



సుభాష్‌నగర్: ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసిన పూర్వ వీఆర్ఏలకు ఎంప్లాయీ ఐడీలు, ఐదు నెలల జీతాలు ఇవ్వాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జీతాలు ఇచ్చే వరకూ సామూహిక సెలవులు తీసుకోవాలని నిర్ణయించి అనుమతి కోసం శుక్రవారం మున్సిపల్ కమిషనర్, నిజామాబాద్ ఆర్డీవోతో పాటు ఆయా శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పూర్వ వీఆర్ఏలకు 5 నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని, ఎంప్లాయీ ఐడీ ఇంతవరకూ రాకపోవడంతో మానసిక వేదనకు గురవుతున్నామన్నారు. అదేవిధంగా ఇతర మండలాలు, జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నేటి నుంచి జిల్లాలోని అన్ని శాఖల పూర్వ వీఆర్ఏలు సామూహికంగా సెలవులు తీసుకుంటున్నామన్నారు. అందుకు జిల్లా కలెక్టర్‌తోపాటు అన్నిశాఖల అధికారులు సహకరించాలని వారు కోరారు.